సాక్షి
వికారాబాద్

బుధవారం । 16 । ఏప్రిల్ । 2025



మొక్కల సంరక్షణకు..

మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ శ్రీనివాస్‌రావు సూచించారు. 8లో▸



బాల్య వివాహాలకు చెక్..

బాల్య వివాహాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం గ్రామాల్లో జరిగే ప్రతి వివాహాన్నీ రిజిస్ట్రేషన్ చేయాలనే నిబంధన తెచ్చింది. 8లో▸



కోతలు షురూ..

యాసంగి సీజన్ వరికోతలు ప్రారంభమయ్యాయి. కానీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు మాత్రం ప్రారంభం కాలేదు. 9లో▸

న్యూస్‌రీల్

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్



విద్యార్థులతో రాజ్యాంగ పీఠిక చదివిస్తున్న రాజశేఖర్

అనంతగిరి: అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్ అన్నారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పార్టీ పిలుపు మేరకు వికారాబాద్‌లోని పలు విద్యాసంస్థల్లో విద్యార్థులచే రాజ్యాంగ పీఠిక చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ అడుగుజాడలో నడవాలన్నారు. కార్యక్రమంలో దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి నవీన్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శివరాజ్‌గౌడ్, నాయకులు శివరాజు, సుధాకర్ ఆచారి, శ్రీకాంత్, విక్రం, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల రికవరీ సులభం

తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



రికవరీ చేసిన సెల్‌ఫోన్లను బాధితులకు అందజేస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు టౌన్: సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) టెక్నాలజీ సహాయంతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సులభంగా రికవరీ చేయవచ్చని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో పోగొట్టుకున్న 13 మంది బాధితుల సెల్‌ఫోన్లను రికవరీ చేసి వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో సెల్‌ఫోన్లు పోయినా, దొంగతనం జరిగినా వాటిని దొరకపట్టడం కష్టతరమయ్యేదన్నారు. ఆధునిక టెక్నాలజీ వచ్చిన తర్వాత వేగవంతంగా రికవరీ చేస్తున్నామన్నారు.గతేడాది 238 సెల్‌ఫోన్లు పోయినట్లు ఫిర్యాదులు రాగా, అందులో 113 ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 40 మంది సెల్‌ఫోన్లు పోగొట్టుకోగా 24 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. ఫోన్ పోయిన వెంటనే బాధితులు ఐఎంఈఐ నంబర్‌తో ఫిర్యాదు చేయాలన్నారు. సెల్‌ఫోన్ల రికవరీలో ముఖ్య పాత్ర పోషించిన కానిస్టేబుల్ మహ్మద్ షబీల్‌ను డీఎస్పీ, పట్టణ సీఐ సంతోష్ కుమార్ అభినందించారు.

కిసాన్ సభ జిల్లా ప్రతినిధిగా సురేష్



కేరళ మంత్రి ప్రసాద్‌తో సురేష్‌కుమార్

కొడంగల్: అఖిల భారత కిసాన్ సభ జిల్లా ప్రతినిధిగా కొడంగల్‌కు చెందిన గంటి సురేష్ కుమార్ ఎంపికయ్యారు. మంగళవారం తమిళనాడులోని నాగపట్నంలో జరిగిన అఖిల భారత కిసాన్ మహాసభలకు వికారాబాద్ జిల్లా ప్రతినిధిగా వెళ్లినట్లు ఆయన తెలిపారు. రైతుల హక్కుల కోసం చట్టాలను చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఉద్యమం నిర్వహించిన అనేక మంది పోరాట యోధులు ఈ మహాసభకు హాజరైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన కేరళ వ్యవ సాయ శాఖ మంత్రి ప్రసాద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిపారు.

పట్టా భూములకు పరిహారం



మహిళా రైతుకు చెక్కు అందజేస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

దుద్యాల్: మండలంలో పారిశ్రామిక వాడ ఏర్పాటు కోసం పట్టా భూములు ఇచ్చిన రైతులకు పరిహారం అందజేశారు. మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ హకీంపేట్ గ్రామ రైతులకు చెక్కులు అందజేశారు. గ్రామానికి చెందిన 33 మంది రైతులకు సంబంధించిన 56.04 ఎకరాల పట్టా భూములకు రూ.11.22 కోట్ల విలువ చేసే పరిహారం చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఉపాధికి ఊతం

- కూలీల దినసరి వేతనం పెంపు రూ.**300** నుంచి రూ.**307**కు సవరిస్తూ కేంద్రం ఉత్తర్వులు
- జిల్లాలో జాబ్ కార్డులు **1,86,193**
- మొత్తం కూలీలు **3,78,084** మంది
- పనిచేస్తున్న వారు: **62,853** మంది
- ఈ ఏడాది పనిదినాల లక్ష్యం **61,64,713**



పరిగి మండలం సయ్యద్‌పల్లిలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు(ఫైల్)

పరిగి: ఉపాధి హామీ పథకం కూలీల రోజువారీ వేతనాన్ని పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. పెంచిన కూలిని ఈ నెల నుంచే అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి. పథకం ప్రారంభ రోజుల్లో దినసరి కూలి రూ.87.50 చెల్లించేవారు. ఈ మొత్తాన్ని ఏటా పెంచుతూ పోగా రూ.300కు చేరింది. ప్రస్తుతం రూ.7 పెంచడంతో రూ.307కు చేరింది.

జిల్లాలో 1,86,193 జాబ్ కార్డులు

జిల్లాలో మొత్తం 1,86,193 జాబ్ కార్డులు ఉండగా 1,26,205 యాక్టివ్‌గా ఉన్నాయి. ఇందులో 62,853 మంది కూలీలు పని చేస్తున్నారు. 2022 మార్చి వరకు రోజువారీ వేతనం రూ.245 చెల్లించేవారు. అదే ఏడాదిలో రూ.12 పెంచారు. దీంతో రూ.257కు చేరింది. 2023 ఏప్రిల్‌లో మరో రూ.15 పెంచడంతో రూ.272కు చేరింది. 2024లో రూ.28 పెంపుతో రూ.300లకు చేరింది. ఈ ఏడాది రూ.7 పెంచడంతో రూ.307కు చేరుకుంది. గత ఏడాది ఉపాధి కూలి రూ.300 ఉన్నా ఒక్కరోజు సగటు వేతనం రూ.220లోపే అందింది. ఈ ఏడాది ప్రతి కూలికి సగటున రూ.300 అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

ఆసక్తి చూపని కూలీలు

ప్రతి ఏటా వేతనం పెంచుతున్నా ఉపాధి పనులపై కూలీలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. సాధారణంగా వేసవి కాలంలో వ్యవసాయ పనులు ఉండవు. ఆ సమయంలో ఎక్కువ మంది ఉపాధి పనులకు వచ్చేవారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ బోరు బావులు ఏర్పాటు చేసుకోవడంతో సొంత పనులపైనే శ్రద్ధ పెడుతున్నారు. దీనికి తోడు ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చే రోజువారీ కూలి ఏ మాత్రం సరిపోవడం లేదని పలువురు అంటున్నారు. ఈ కారణంగానే ప్రైవేటు పనులకు వెళుతున్నట్లు తెలిసింది. అడ్డా కూలీకి వెళ్తే రోజుకు రూ.500 నుంచి రూ.700 వరకు వస్తుండటంతో అటు వైపే మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల కూడా పనులకు రావడం లేదు.

చాలా తక్కువ పెంచారు



ఉపాధి హామీ పథకం కూలీల దినసరి వేతనం చాలా తక్కువగా పెంచారు. కేవలం రూ.7 మాత్రమే పెంచడం సరికాదు. ఈ డబ్బు ఎందుకూ సరిపోదు. కేంద్రం పునరాలోచన చేయాలి.

– వెంకటయ్య, పాలేపల్లి

బకాయి డబ్బు చెల్లించాలి



ఉపాధి పనులు చేసి నెలలు కావస్తున్నా డబ్బు ఇవ్వడం లేదు. వెంటనే చల్లిస్తే బాగుంటుంది. కూలి డబ్బు మరింత పెంచి ఉంటే బాగుండేది. కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చొరవ చూపాలి.

– పద్మమ్మ, బొంపల్లి

సద్వినియోగం చేసుకోవాలి

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల రోజువారీ వేతనాన్ని రూ.300 నుంచి రూ.307కు పెంచింది. ఈ నెల నుంచే అమలు చేయాలని ఆదేశాలు అందాయి. జాబ్‌కార్డులు ప్రతి ఒక్కరికీ పనులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఈ అవకాశాన్ని జిల్లాలోని కూలీలందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీనివాస్, పీడీ, డీఆర్‌డీఓ

‘ఓపెన్’ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: ఓపెన్ స్కూల్, ఓపెన్ ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 8 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఓపెన్ స్కూల్ పరీక్షలకు వికారాబాద్‌లో రెండు, తాండూరు ఒక సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఓపెన్ ఇంటర్ పరీక్షలకు వికారాబాద్‌లో మూడు, తాండూరులో రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్లను అనుమతించరాదన్నారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వరాదని ఆదేశించారు. ప్రశ్న పత్రాలు ఇచ్చే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సంస్కృతం, తెలుగు కోడ్ నంబర్లు చెక్ చేసి ఇవ్వాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద గల జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించరాదని సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే తాగునీటి సౌకర్యం, విద్యుత్, ఫ్యాన్స్ ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఏ చిన్న పొరపాటు జరిగినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, జిల్లా విద్యాధికారి రేణుకాదేవి, డీఎస్పీలు శ్రీనివాస్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, ఏసీజీ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పరీక్షల నిర్వహణపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

‘ఇందిరమ్మ’ లబ్ధిదారులకు చెక్కులు

- నగరంలో అందజేసిన సీఎం రేవంత్‌రెడ్డి



అనంతగిరి: సీఎం చేతుల మీదుగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులు

అనంతగిరి/పూడూరు: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు మంగళవారం నగరంలోని శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చెక్కులు అందజేశారు. పైలెట్ గ్రామాల్లో 300 గృహాలకు మార్కింగ్ చేయగా, 25 మంది లబ్ధిదారులు బేస్‌మెంట్ పనులు పూర్తి చేశారు. వీరిలో ఇద్దరికి సీఎం రూ.లక్ష చొప్పున అందజేశారని, మిగిలిన వారికి ఆన్‌లైన్‌లో చెల్లించనున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. చెక్కులు అందుకున్న వారిలో దుద్యాల్ మండలం సంగాయిపల్లికి చెందిన నూర్జహాన్ బేగం, పూడూరు మండలం ఎంకేపల్లికి చెందిన మాల లక్ష్మి ఉన్నారు.

కాలి బూడిదైన ‘ఎస్‌బీఐ’

- తాండూరులోని కరన్‌కోట్ బ్రాంచ్‌లో అగ్నిప్రమాదం
- కంప్యూటర్లు, ఏసీలు, ఫర్నిచర్ దగ్ధం
- రూ.60 లక్షల ఆస్తి నష్టం



బ్యాంకులో చెలరేగుతున్న మంటలు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో మంగళవారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సుమారు రెండు గంటల పాటు దట్టమైన పొగలతో మంటలు చెలరేగాయి. దీంతో సీసీఐ కాలనీవాసులు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో సుమారు రూ.60 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బ్యాంక్ మేనేజర్ టి.భువన్‌మోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. తాండూరులోని సీసీఐ కాలనీలో ఉన్న ఎస్‌బీఐ తాళాలు తెరిచేందుకు మంగళవారం ఉదయం 9:10 నిమిషాలకు బ్యాంక్ మేనేజర్ భువన్ మోహన్‌తో పాటు సెక్యూరిటీగార్డ్ వచ్చారు. తాళాలు తెరవగా లోపలి నుంచి పొగలు రావడాన్ని గమనించి వెంటనే 100తో పాటు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ జలంధర్‌రెడ్డి సిబ్బందితో వచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. ఎంతకీ అదుపులోకి రాకపోవడంతో కొడంగల్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ ప్రభాకర్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. రెండు ఫైరింజన్లతో దాదాపు మూడు గంటల పాటు శ్రమించగా ఎట్టకేలకు మంటలు అదుపులోకి వచ్చాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనలో బ్యాంకులోని ఆరు కంప్యూటర్లు, బ్యాటరీలు, ఏసీలు, ఫర్నిచర్ కాలి బూడిదయ్యాయి. జిల్లా ఫైర్ ఆఫీసర్ పూర్ణచందన్ ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. విషయం తెలుసుకున్న బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు బ్రాంచ్ వద్దకు చేరుకుని ఆందోళన చెందారు. మంటలు ఆర్పే సమయంలో తాండూరు ఫైరింజన్ రెండు సార్లు మొరాయించింది.

డబ్బులు, బంగారం సేఫ్

తమ బ్రాంచ్‌లో జరిగిన అగ్ని ప్రమాదం కలచివేసిందని బ్యాంక్ మేనేజర్ భువన్‌మోహన్ ఆవేదన వ్యక్తంచేశారు. కళ్లముందే ఫర్నిచర్ కాలిపోతున్నా ఏమీ చేయలేక నిస్సహాయ స్థితిలో చూస్తూ ఉండిపోయామన్నారు. లాకర్లలోని డబ్బులు, బంగారం, రైతుల పాసు పుస్తకాలు భద్రంగా ఉన్నాయని తెలిపారు. ఈ విషయమై హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి సమాచారం అందించామన్నారు. వారం రోజుల తర్వాత బ్యాంక్ సేవలు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టంచేశారు. బీఎం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.



దగ్ధమైన ఫర్నిచర్

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

షాద్‌నగర్: ఆయిల్‌పామ్‌తో రైతులు అధిక లాభాలు పొందొచ్చని ఆయిల్ సీడ్స్ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ డాక్టర్ పొన్ను స్వామి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్లలో రైతు నర్సింహారెడ్డి సాగు చేసిన ఆయిల్‌పామ్‌ను పంటను కేంద్రం బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ పొన్ను స్వామి మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగుకు చాలా మంది రైతులు ఆసక్తి కనబరుస్తున్నారని తెలిపారు. నీటి వసతులు ఉన్న వ్యవసాయ క్షేత్రాల్లో సాగు చేస్తే ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చని చెప్పారు. ఈ తోటలకు చీడపీడలు సోకే అవకాశం తక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ విజయకృష్ణ, ఉద్యాన శాఖ అదనపు డైరెక్టర్ సరోజిని, వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ సంస్థ ఉపాధ్యక్షుడు రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం పరిధిలో పంటల పరిశీలన

మహేశ్వరం: మండల పరిధిలోని మన్సాన్‌పల్లి, ఘట్టుపల్లి గ్రామాల్లో సాగు చేసిన ఆయిల్ పామ్ తోటలను మంగళవారం ఆయిల్ సీడ్స్ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ డాక్టర్ పొన్ను స్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏ పంటకు లేని విధంగా ఆయిల్‌పామ్‌కు చట్టం ఉందన్నారు. జిల్లాలో వ్యాల్యూ అనే కంపెనీతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అదనపు డైరెక్టర్ సరోజిని, వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ సంస్థ ఉపాధ్యక్షుడు రామ్మోహన్‌రావు పాల్గొనారు.

రేపటి నుంచి ‘భూ భారతి’ సదస్సులు

- 30 వరకు కార్యక్రమాలు
- ఏర్పాట్లలో నిమగ్నమైన జిల్లా అధికారులు
- రైతుల అనుమానాలను నివృత్తి చేయనున్న అధికారులు
- కలెక్టర్, అదనపు కలెక్టర్ హాజరయ్యే అవకాశం



వికారాబాద్: భూ భారతి చట్టంపై అవగాహన కల్పించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. రెవెన్యూ సమస్యలను మరింత సమర్థవంతంగా పరిష్కరించాలని భావించిన ప్రభుత్వం.. కొత్త చట్టంపై ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు మండలస్థాయి సదస్సులు నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లా అధికారులు ఏయే మండలంలో ఏయే రోజు సదస్సు నిర్వహించాలి.. సదస్సుకు ఎవరెవరు హాజరు కావాలి అనే దానిపై షెడ్యూల్ తయారు చేశారు. ఇందుకు తగ్గట్లు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ఆయా మండలాల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పలు దఫాలుగా భూ భారతి చట్టంపై రాష్ట్ర స్థాయి అవగాహన సదస్సులకు హాజరైన కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు కొత్త చట్టంపై రైతులకు అవగాహణ కల్పించనున్నారు.

ప్రతి సదస్సుకు హాజరుకానున్న కలెక్టర్

మొత్తం సెలవులు పోనూ 11 రోజుల పాటు భూ భారతి అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. 20 మండల కేంద్రాల్లో సదస్సులు జరగనున్నాయి. రోజుకు రెండు చొప్పున(ఉదయం, మధ్యాహ్నం)నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. ప్రతి సదస్సుకు కలెక్టర్‌తోపాటు అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), ఆర్డీఓలు, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది హాజరుకానున్నారు. వీరితో పాటు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు వచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. మండల స్థాయి సదస్సుకు అన్ని గ్రామాల రైతులు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

సమగ్ర అవగాహనకు..

భూ భారతి చట్టంపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించనున్నారు. కొత్త చట్టం ప్రకారం రెవెన్యూ శాఖకు సంబంధించి ఏ సమస్య.. ఏ స్థాయిలో.. ఎవరి వద్ద పరిష్కారమవుతుందో వివరిస్తారు. ఎలా దరఖాస్తు చేసుకోవాలి.. ఎవరిని సంప్రదించాలి అనే విషయాలను తెలియజేస్తారు. కొత్త చట్టంపై రైతులకు ఉన్న అనుమానాలను అధికారులు నివృత్తి చేస్తారు.

రైతులు హాజరుకావాలి




ప్రభుత్వం కొత్తగా తెచ్చిన భూ భారతి చట్టం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. గతంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు ఈ చట్టం ద్వారా త్వరితగతిన పరిష్కారమయ్యే అవకాశం ఉంది. మండల కేంద్రాల్లో నిర్వహించే సదస్సులకు రైతులు తప్పకుండా హాజరుకావాలి.

– ప్రతీక్‌జైన్, కలెక్టర్

అంబేడ్కర్ భావజాల వ్యాప్తికి కృషి చేయాలి

టీజీసీజీ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీంరాజ్



బొంరాస్‌పేట: తెలంగాణ జానపద కళలతో అంబేడ్కర్ భావజాల వ్యాప్తికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని అసిస్టెంట్ రిజిస్ట్రార్, తెలంగాణ సహకార శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.భీంరాజ్ అన్నారు. మంగళవారం ఆయన తన స్వగ్రామం మండలంలోని కొత్తూరులో మాట్లాడారు. మూడు దశాబ్దాల క్రితం కొడంగల్ ప్రాంతంలో అప్పటి మేధావులు, స్ఫూర్తి దాతలతో అంబేడ్కర్ భావజాలానికి విత్తనం నాటామన్నారు. నేడు పల్లెపల్లెన సంఘాలుగా ఏర్పాటై చైతన్యం రావడం హర్షణీయమన్నారు. కాగా సామాన్య జనానికి సైతం అంబేడ్కర్ జీవిత అంశాలు తెలియజేయడానికి ‘అంబేడ్కర్ వీధి నాటకం’ప్రదర్శనకు పూనుకోవడం మంచి పరిణామన్నారు. అందుకు ముందుకు వచ్చిన కళాకారులను, అంబేడ్కర్ వాదులను అభినందించారు. వీధి నాటక రచయిత మొండి మైసప్ప, నాటకోపాధ్యాయుడు అంజిలప్పను అభినందించారు. తెలంగాణ జానపద కళ వీధి నాటక ప్రదర్శనతో భావజాల వ్యాప్తి చెందుతుందన్నారు. నాటకం పుస్తక ముద్రణకు విరాళం ప్రకటించారు. ఆడియో రికార్డింగ్‌కు తన వంతు కృషి చేస్తానని జిల్లా ఎస్సీ ఎస్టీ మైనార్టీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు చంద్రయ్య హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేఎస్‌పీఎస్ మండల అధ్యక్షుడు అంజిలయ్య, ఉపాధ్యక్షుడు బాల్‌రామ్, నాయకులు గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లి మార్గంలో రోడ్డుపై పడిన విద్యుత్ స్తంభం

గాలివాన హైరానా

- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు, మామిడి కాయలు

చౌడాపూర్ మండలంలో మంగళవారం గాలివాన హైరానా సృష్టించింది. కొత్తపల్లి, పుర్సంపల్లి, మరికల్ గ్రామాల్లో ఈదురు గాలులకు పంటలు దెబ్బతిన్నాయి. కొత్తపల్లి మార్గంలో విద్యుత్ స్తంభం రోడ్డుపై పడింది. పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం.. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పుర్సంపల్లిలో అంజిలయ్య ఇంటి పైకప్పు ఎగిరిపోయింది. మరికల్ గ్రామంలో భీమయ్య తోటలో మామిడికాయలు భారీగా రాలిపోయాయి. మండల వ్యాప్తంగా మామిడి పంటకు భారీ నష్టం జరిగినట్లు తెలిసింది.

– కుల్కచర్ల



మరికల్ గ్రామంలో రాలిన మామిడి కాయలు



పుర్సంపల్లిలో గాలికి ఎగిరిపోయిన అంజిలయ్య ఇంటి పైకప్పు

క్లుప్తంగా

రేపు జాబ్‌మేళా

అనంతగిరి: అర్హులైన నిరుద్యోగులు గురువారం నిర్వహించే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి సుభాన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ పట్టణం కూరగాయల మార్కెట్ పక్కనున్న ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో ఇంటర్వ్యూలు ఉంటాయని చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన మాక్స్ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 50 పోస్టుల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వివరాలకు 96760 47444 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సేవాభావంతో పనిచేయాలి



డాక్టర్ కిరణ్‌గౌడ్, సిబ్బందిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

కుల్కచర్ల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యాధికారులు, సిబ్బంది సేవాభావంతో పనిచేయాలని దిశ కమిటీ సభ్యులు జానికీరాం, కేంద్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు ఘణపురం వెంకటయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నూతనంగా నియమితులైన వైద్యాధికారి కిరణ్ గౌడ్, వైద్య సిబ్బందిని వారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జానికీరాం, వెంకటయ్య మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చిన వారికి సరైన వైద్య సేవలు అందించి ఆరోగ్యం విషయంలో తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాధురి, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్యముదిరాజ్, వెంకటేష్, మహేష్, చలివేంద్రం మహేష్, ఆంజనేయులు, రాజు, శ్రీశైలం, పాండు, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

జాతరకు హాజరైన మాజీ మంత్రి

బావోజీకి ప్రత్యేక పూజలు



బావోజీని దర్శించుకుంటున్న నేతలు

కొడంగల్: నియోజకవర్గ పరిధిలోని మద్దూరు మండలం తిమ్మారెడ్డిపల్లిలో వెలిసిన శ్రీ గురు లోక్ మసంద్ బావోజీ జాతరకు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జాతర నిర్వాహకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు నర్మద కిష్టప్ప, ఎరన్‌పల్లి శ్రీనివాస్, చాంద్‌పాష్ తదితరులు ఉన్నారు.

గిన్నిస్ రికార్డులో దోమ యువకుడికి చోటు



రాములుకు సర్టిఫికెట్ అందజేస్తున్న గిన్నిస్ సంస్థ ప్రతినిధి అగస్టిన్


దోమ: గంటపాటు నిరంతరాయంగా కీబోర్డు వాయించిన యువకుడికి గిన్నిస్ రికార్డులో చోటు దక్కింది. 2024 డిసెంబర్ 1న నగరంలోని మణికొండలో ఉన్న హలెల్ మ్యూజిక్ స్కూల్ మేనేజ్‌మెంట్ ఎనిమిది దేశాల నుంచి ఆన్లైన్ మ్యాజిక్ స్కూల్‌కు ఎంట్రీలను ఆహ్వానించింది. 1,046 మంది పేర్లు నమోదు చేసుకోగా వారికి ఏడాది పాటు శిక్షణ ఇచ్చారు. గంటపాటు నిరంతరంగా కీబోర్డు వాయించాల్సిన పోటీలో గ్రామానికి చెందిన కొజ్జ రాములు సత్తా చాటి గిన్నిస్ రికార్డులో చోటు సంపాదించుకున్నాడు. హలెల్ మ్యూజిక్ స్కూల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం గిన్నిస్ సంస్థ ప్రతినిధి అగస్టిన్(వేణుగోపాల్) రాములుకు సర్టిఫికెట్ అందజేశారు.

బాల్య వివాహాలకు చెక్ పెట్టేందుకే రిజిస్ట్రేషన్

రహస్యంగా జరిగే బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ప్రతీ వివాహాన్ని రిజిస్ట్రేషన్ చేయాలనే నిబంధన తీసుకువచ్చింది. కొత్త పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం తీసుకువచ్చిన ఈ విధానం అధికారుల అలసత్వంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం

- పంచాయతీల్లో ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నా ఆదరణ కరువు



దౌల్తాబాద్: బాల్య వివాహాల నివారణకు ప్రభుత్వం వివాహాలు రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసింది. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ పంచాయతీల్లో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వివాహ నమోదుకు వెసులుబాటు కల్పించింది. గ్రామ పంచాయతీల్లో ఈ ప్రక్రియ ఉచితంగా చేసుకోవచ్చు. దీనిపై అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడంతో చాలా మంది రిజిస్ట్రేషన్ చేసుకోవడం లేదు. మండల పరిధిలో 33 పంచాయతీలుండగా 2024 నుంచి 200 వివాహాలు మాత్రమే వివాహ నమోదు చేయించుకున్నారు. ప్రతీ ఏడాది వేల సంఖ్యలో వివాహాలు జరుగుతుంటే వందల సంఖ్యల్లోనే నమోదవడం గమనర్హం.

నెరవేరని ప్రభుత్వ లక్ష్యం

బాల్యవివాహాలు అరికట్టేందుకు ప్రభుత్వం చట్టాలు తీసుకువచ్చినా ఫలితం లేకుండా పోతోంది. చట్ట ప్రకారం అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేయాల్సి ఉంటుంది. వివాహాన్ని చట్టబద్ధంగా చేసుకుంటే ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా లబ్ధిపొందవచ్చని అధికారులు చెబుతున్నారు. 2002లో వివాహాల రిజిస్ట్రేషన్ భాధ్యత పంచాయతీ కార్యదర్శులకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లా, మండల స్థాయి అధికారులు వివాహాల రిజిస్ట్రేషన్‌పై వీటితో కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించకపోవడంతో ప్రజలు ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం వివాహాల సీజన్ ఉండడంతో ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక చొరవ చూపి వివాహాల రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

> **అవగాహన కల్పిస్తాం**
>
> గ్రామాల్లో ప్రజలకు వివాహాల రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పిస్తాం. వీటితో చేకూరే ప్రయోజనాలను ప్రజలకు పంచాయతీ కార్యదర్శులు వివరిస్తున్నారు. ప్రత్యేక చొరవ తీసుకుని అవగాహన కల్పించాలని ఆదేశించాం.
>
> – శ్రీనివాస్, ఎంపీడీఓ, దౌల్తాబాద్



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోవడం సరికాదు

- నిర్మించుకున్న నివాసాలకు ఇంటి నంబర్ కేటాయించండి
- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య

పరిగి: ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో పేదలు ఇళ్లు నిర్మించుకుంటుంటే అధికారులు అడ్డుకోవడం సరికాదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. తుంకుల్‌గడ్డలో ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోవద్దనే డిమాండ్‌తో మంగళవారం ర్యాలీ చేపట్టి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ఆనంద్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వం పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు స్థలాలు ఇచ్చిందని.. ప్రస్తుతం వారు నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు అడ్డుపడడం సమంజసం కాదన్నారు. పట్టణ కేంద్రంలో వందలాది అక్రమ లేఅవుట్లు, ప్లాట్లు ఉన్నా వాటిని పట్టించుకోకుండా పేదలపై కన్నెర్ర చేయడం సరికాదన్నారు. ఇప్పటికే నిర్మించుకున్న వారి ఇంటికి నంబర్ కేటాయించకపోవడంతో వారు ప్రభుత్వం అందించే సౌకర్యాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు, విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అధికారులు చేస్తున్న పనికి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి నిర్మాణాలను అనుమతులు ఇవ్వాలని.. లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు చంద్రయ్య, హబీ బ్, సత్తయ్య,శేఖర్, శ్రీరామ్, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

బోధనలో నిర్లక్ష్యం వహించొద్దు



అంబేడ్కర్‌నగర్ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకట్

మండల విద్యాధికారి వెంకట్

దోమ: ఉపాధ్యాయులు బోధనలో నిర్లక్ష్యం వహించొద్దని మండల విద్యాధికారి వెంకట్ సూచించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని మోత్కూర్ అంబేడ్కర్‌నగర్ పాఠశాలను సందర్శించి పరిసరాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు తరగతుల వారీగా ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2, ఎస్ఏ-1, ఎస్ఏ-3 ఆన్లైన్ ఎంట్రీలు చేయాలన్నారు. బడీడు పిల్లల సమాచారం సేకరించి విద్యార్థులను పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనంలో మెనూ పాటిస్తూ.. బిల్లులను ఎప్పటికప్పుడు చేయించుకునేలా శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కాంప్లెక్స్ సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.



గౌరారం సమీపంలో రోడ్డుపై ధాన్యం



సాగారంతండా సమీపంలో కల్వర్టుపై ఆరబెట్టిన ధాన్యం

రోడ్లే కల్లాలు!

రోడ్లు, కల్వర్టులపై ధాన్యం ఆరబోస్తుండటంతో వాహనదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మండల పరిధిలోని సాగారంతండా, గౌరారం, గౌరారంతండా, ముచ్చకుంట తండాలతో పాటు ఇతర గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులపై రైతులు వడ్లు ఎండబోస్తున్నారు. కల్లాలు లేకపోవడంతో త్వరగా ఎండుతాయనే ఉద్దేశంతో రోడ్లను ఆశ్రయిస్తున్నారు. కానీ ఇది పలుమార్లు ప్రమాదాలకు దారితీస్తోంది.

– దుద్యాల్

మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు అవసరం



అనంతసాగర్ అటవీప్రాంతంలో నాటిన మొక్కల ఎదుగుదలను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ శ్రీనివాస్‌రావు

కుల్కచర్ల: మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం ఆయన అనంతసాగర్ అటవీ ప్రాంతంలో గతేడాది నాటిన 6,666 మొక్కల ఎదుగుదలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ మాట్లాడుతూ.. ఈ ఏడాది మొక్కలు నాటే సంఖ్యను పెంచి సంరక్షించాలని.. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న మొక్కల సంరక్షణకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరిగి రేంజ్ ఆఫీసర్ ప్రతిమ, సెక్షన్ ఆఫీసర్ సాయికుమార్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు షురూ

తాండూరు టౌన్: భావిగి భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు మంగళవారం మహా ప్రసాద వితరణతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ చైర్మన్ పటేల్ కిరణ్, ఈఓ శేఖర్‌గౌడ్ సమక్షంలో ప్రత్యేక పూజలు చేసి జాతరను ప్రారంభించారు. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు వివేక్ సెరికర్ దంపతుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణ మాత దాసోహ మందిరంలో మహాప్రసాద వితరణ చేశారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మహా ప్రసాదాన్ని స్వీకరించారు. 19న స్వామి వారి రథోత్సవం, 20న లంకాదహనం, పశుప్రదర్శన తదితర కార్యక్రమాలు జరుగనున్నట్లు ఆలయ చైర్మన్ పటేల్ కిరణ్ తెలిపారు.



దాసోహ మందిరంలో భక్తజనం

కాంగ్రెస్‌తోనే రాజ్యాంగ స్ఫూర్తికి రక్షణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: రాజ్యాంగ స్ఫూర్తితో కాంగ్రెస్ పనిచేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన రాజ్యాంగ సవరణను వ్యతిరేకిస్తూ మంగళవారం చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండలంలోని వైఎం తండా, పులిచర్లకుంట తండా, చింతగట్టు తండా, సిద్ధాపూర్, ఎస్‌బీపల్లి, కొడిచర్ల గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీజేపీ రాజ్యాంగంలో పొందుపర్చిన పలు చట్టాలను సవరణ చేస్తూ నిర్వీర్యం చేస్తోందని మండి పడ్డారు. ఇదే విషయాన్ని ప్రజలకు వివరించి తాము రాజ్యాంగ రక్షణకు కృషి చేస్తున్నామన్నారు. చట్టాల సవరణతో ప్రజలు ప్రశ్నించే హక్కుకు దూరమవుతున్నారని వివరించారు. రాజ్యాంగ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు తమతో కలిసి రావాలని పిలుపునిచ్చారు.

అక్రమాలకు పాల్పడిన వారిని వదలం

గత ప్రభుత్వ హయాంలో సిద్ధాపూర్‌లో టీజీఐఐసీకి కేటాయించిన భూముల అక్రమాలపై విచారణ సాగుతోందని ఎమ్మెల్యే వెల్లడించారు. కొందరు ఈ విషయమై అసత్య ప్రచారం చేస్తున్నారని వారి ఆరోపణలకు త్వరలోనే సమాధానం చెప్తామని హెచ్చరించారు. భూముల వ్యవహారంలో అక్రమాలకు పాల్పడిన వారిని వదిలే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఇన్‌చార్జి జైపాల్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, ప్రభాకర్, రవీందర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, మల్లారెడ్డి, జంగయ్య, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీ

ఇబ్రహీంపట్నం: సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు పోలీసులు వాటిని రికవరీ చేసి మంగళవారం అప్పగించారు. ఇబ్రహీంపట్నం సీఐ జగదీశ్ తెలిపిన ప్రకారం.. సెల్‌ఫోన్లను పోగొట్టుకుని తమకు ఫిర్యాదు చేసిన బాధితులకు సీఎంఈఆర్ పోర్టల్ సహకారంతో గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. సుమారు పది సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు నాగరాజు, శ్రీనివాస్ తదితరులున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కందుకూరు: కందుకూరు ఠాణా పరిధిలో రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సీఐ సీతారామ్ తెలిపిన ప్రకారం.. మండల కేంద్రం నుంచి హైదరాబాద్ వెళ్లే మార్గంలో కొత్తగూడ పంచాయతీ పరిధి బాలాజీ వెంచర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి శవం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతుడి వయస్సు 40–45 సంవత్సరాలు ఉంటుందని.. ఒంటిపై ఎటువంటి గాయాలు లేవన్నారు. కొద్ది రోజులుగా కందుకూరు చౌరస్తాలో భిక్షాటన చేసుకుని జీవిస్తున్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు చెప్పారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712662687 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి



కొందుర్గు: ఎద్దు కళేబరం

కొందుర్గు: పిడుగుపాటుకు ఓ ఎద్దు మృత్యువాత పడింది. ఈ ఘటన మండల పరిధిలోని శ్రీరంగాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన బుయ్యని లాలయ్య మంగళవారం ఉదయం తన ఎద్దులను మేపి వ్యవసాయ పొలంలో ఉన్న చెట్టుకు కట్టేసి మధ్యాహ్న భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వర్షం తగ్గిన తర్వాత పొలానికి వెళ్లి చూడగా పిడుగుపడి ఓ ఎద్దు మృత్యువాత పడింది. మృతి చెందిన ఎద్దు విలువ సుమా రు రూ.70 వేలు ఉంటుందని.. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

కుర్మిద్దలో ఆవు..

యాచారం: పిడుగు పాటుకు ఆవు మృత్యువాత పడింది. ఈ ఘటన మండల పరిధిలోని కుర్మిద్దలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పసుల సత్తయ్య రెండు నెలల క్రితం రూ.90 వేలు వెచ్చించి పాడి ఆవులను కొనుగోలు చేశాడు. మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి పిడుగుపడడంతో వ్యవసాయ క్షేత్రంలో చెట్టుకు కట్టేసిన ఆవు మృత్యువాత పడింది. ఆవుతోనే జీవనోపాధి పొందుతున్నానని.. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

చైల్డ్‌కేర్ సెంటర్‌లో హెల్త్‌చెకప్ తప్పనిసరి

అడిషనల్ కలెక్టర్ సుధీర్



పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్, డీడబ్ల్యూఓ

అనంతగిరి: చైల్డ్‌కేర్ సెంటర్‌లో మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలని.. ప్రతీ నెల హెల్త్ చెకప్ చేయించాలని.. విధిగా రికార్డ్స్ నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ సుధీర్ అన్నారు. మంగళవారం ఆయన వికారాబాద్ పట్టణం ఎన్నెపల్లిలో ఉన్న వివేకానందా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్(బాలికల) చైల్డ్‌కేర్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సెంటర్ పరిసర ప్రాంతాలను, డార్మెటరీ, వాష్ రూంలను పరిశీలించారు. సెక్యూరిటీ, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారా అని వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఐదు చైల్డ్‌కేర్ సంస్థలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీడబ్ల్యూఓ జయసుధ పలువురు అధికారులు ఉన్నారు.

వాహనాల బ్యాటరీల చోరీ

షాద్‌నగర్: పార్క్ చేసిన వాహనాల నుంచి గుర్తు తెలియని దుండగులు బ్యాటరీలను చోరీ చేశారు. ఈ ఘటన మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌తో పాటు గ్రామానికి చెందిన వాడ్యాల శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్యకు చెందిన ట్రాక్టర్ల నుంచి, వడ్డె శంకర్ ఆటోలోని బ్యాటరీలను చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పనికోసం తీసుకెళ్లి..

కూలీల వద్ద బంగారం, నగదు దోపిడీ

నందిగామ: గుర్తు తెలియని వ్యక్తి పని ఉందని ఇద్దరు మహిళలను తీసుకెళ్లి వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలు, నగదు దోచుకెళ్లిన ఘటన మంగళవారం మండల పరిధిలోని రంగాపూర్‌లో చోటు చేసుకుంది. సీఐ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. నాగర్ కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి గ్రామానికి చెందిన నిమ్మల విజయ, గండీడు గ్రామానికి చెందిన కావలి సత్తమ్మ కుటుంబ సభ్యులతో కలిసి కొత్తూరుకు వలస వచ్చారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న విజయ, సత్తమ్మ పనికోసం కొత్తూరులోని కూలీ అడ్డా వద్దకు వచ్చారు. గుర్తు తెలయని వ్యక్తి వీరిద్దరికీ పని ఉందని చెప్పి తన బైక్‌పై రంగాపూర్ శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అప్పటికే అక్కడ ఉన్న మరో వ్యక్తితో కలిసి మహిళల వద్ద ఉన్న తులంన్నర బంగారు ఆభరణాలు, రూ.5 వేల నగదు దోచుకుని అక్కడ నుంచి ఉడాయించారు. మహిళల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు పాత నేరస్తులకు రిమాండ్

రూ.17.5 లక్షల సొత్తు స్వాధీనం

మీర్‌పేట: తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు పాత నేరస్తులను మీర్‌పేట పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి రూ.17.5 లక్షల సొత్తును రికవరీ చేశారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన ప్రకారం.. నాగోల్ డివిజన్ జైపురి కాలనీలో నివాసం ఉండే కారు డ్రైవర్ కట్టెల అనూప్ కుమార్(35), అంబర్‌పేటకు చెందిన వెల్డింగ్ కార్మికుడు మహ్మద్ అఫ్రోజ్‌ఖాన్(26) స్నేహితులు. వీరిద్దరిపై రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధి లోని సంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని అంకోలా ఠాణాల్లో కేసులున్నాయి. అనూప్‌కుమార్ 80 కేసులు, అఫ్రోజ్‌ఖాన్ 52 కేసుల్లో జైలు జీవితం గడిపి 2024లో బయటకు వచ్చిన వీరు తమ ప్రవర్తన మార్చుకోకుండా మరో నిందితుడు భరత్‌కుమా ర్ శర్మతో కలిసి చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల రాచకొండ పరిధిలోని మీర్‌పేట, ఆదిబట్ల, హయత్‌నగర్, చర్లపల్లి, మేడిపల్లి, కీసర, ఘట్‌కేసర్, భువనగిరి, ఆర్మూర్, బాసర, కోదాడ టౌన్ పీఎస్ పరిధిలో 23 చోరీలు చేశారు. దర్యా ప్తు చేపట్టిన మీర్‌పేట క్రైం బృందం ఇద్దరు నిందితులను మంగళవారం రిమాండ్ తరలించారు. వారి వ ద్ద నుంచి 170 గ్రాముల బంగారు ఆభరణాలు, 250 గ్రాముల వెండి వస్తువులు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న నర్సింహారెడ్డి

యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి

కొత్తూరు: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ పంచాయతీ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన కార్మికులతో కలిసి ఎంపీడీఓ అరుంధతికి వినతి పత్రం అందజేశారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు నూతన జీఓల ప్రకారం వేతనాలు పెంచి ఇవ్వాలని కోరారు. ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, సౌకర్యాలు కల్పించాలన్నారు. విధుల్లో భాగంగా, సహజ మరణం పొందిన కార్మికుల కుటుంబాలకు బీమా సౌకర్యం, కార్మికులకు రక్షణ పరికరాలు, బూట్లు, మాస్కులు ఇవ్వాలని విన్నవించారు. తరచుగా ఆరోగ్య పరీక్షలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్‌రెడ్డి, భిక్షపతి, దేవయ్య, సురేశ్, జంగయ్య, రాములు, కృష్ణయ్య పాల్గొన్నారు.